

# వక్రించిన రేఖలు

సింగరాజు రామచంద్రమూర్తి

"అనూరాధా!..రాధా...రాధా!" ఇంట్లో కి వస్తూనే గావుకేకలు ప్రారంభించాడు శర్మ.

"ఏమిటినాయనా?" వంటింట్లోనుంచి వచ్చింది సమాధానం.

"రాధలేదా అత్తయ్యా?"

"అనూరాధా! దానివిషయమే అడిగావు? మధ్యాహ్నంరెండింటి కనగా బయటికిపోయింది. ఇంతవరకు అయిపులేదుకదా?...ఏమిటి చెప్పేది! చిన్నదా చితకదా— ఏమన్నా అంటేనో నామీద విరుచుకు పడుతుంది. ...కూర్చోనాయనా,కాఫీ పట్టుకొస్తాను."

"ఎక్కడికి వెళ్ళిఉంటుంది! సినిమాకేమయినా వెళ్ళెయ్యలేదుకదా— ఏంఅత్తయ్యా?" అన్నాడు సోఫాలో కూర్చుని బూట్లు విప్పుకుంటూ.

"సినిమాలకే వెళ్ళిందో నాటకాలే సేవిస్తోందో? అయినా ఆయన వెర్రిగానీ ఆడ పిల్లకి చదువెందుకండి. అంటే వినేవారు లేరు. ఉద్యోగాలు చెయ్యాలా వూళ్లేలాలా? ఆ స్కూల్ ఫైనల్‌తో ఆపించండి. మహారాజా! అంటే ఆమనిషి వింటేనా—ఇప్పుడు నేను అనుభవిస్తున్నాను."

"అదేంమాట అత్తయ్యా! నువ్వన్నట్టు ఆడపిల్లకి పెద్ద చదువు అనసరమే అనుకో కానీ—

"కానీలేదు, అర్థనాలేదు— అనవసరం, అనవసరం ముమ్మాటికీ అంతే! వంటచేయడం రాదు కదా—పొయ్యిమీదనుంచి గిన్నెదింపలేదు. ఎందుకొచ్చినచదువుట? ఏమంటావు—

"మరే నిజం చెప్పావు"

"పొగవంటికి పడదు. కళ్ళుమండటం ఒళ్ళుమండటం....ఆడదానికి పొగపడక పోతే ఎలా జరుగుతుంది. ఏమన్నా అంటే మూతి మూడుసార్లు విరుస్తుంది. ఇలా అయితే ఎలాగడుస్తుంది.?"

"మరే ఎలా గడుస్తుంది!"

"ఏం, ఎందుకు గడవదు. ?"

"మరే, ఎందుకు గడవదు" అన్నాడు పరధ్యానంగా మాగజైను తిరగేస్తూ.

"ఏమిటి మహాశయా, ఇందాకటినుంచీ ఏం వింటున్నారు?"

అదిరిపడి ముఖంపైకి ఎత్తాడు. ఎదురుగా నిలబడివుంది అనూరాధ కోపంతో! గతుక్కుమన్నాడు. శర్మ.

"ఏమిటి ఇందాకనుంచీ తెగ మాట్లాడుతున్నావు?"

"అ.....త్త.....య్య ఏదీ?" అన్నాడు కంగారుగా.

"అత్తయ్యా ఇంట్లోలేదు. వంటింట్లోనుంచి నీతో మాట్లాడుతున్న అత్తయ్యని నేనే!"

ఉలిక్కి పడ్డాడు శర్మ. ఇప్పుడు రాబోయే యుద్ధాన్ని ఎదుర్కోవటం ఎలా" అన్నదే అతని సమస్య.

"ఆడదానికి పై చదువు అనవసరమా?..మహా పికేనా అవసరం?...ఆడది మట్టుకు ఉద్యోగాలు చేయలేదూ? కావాలంటే ఊళ్లకూడా ఏలగలం! ఇదివరకు నాతో ఏమన్నావు?"

"ఏమన్నాను?"

"పైకి చదువురాధా, బి.ఏ. పూర్తికానీయ్యి అంది నువ్వేగా.....ఇప్పుడేమో వంటనేయుండే గడవదవటున్నావా?"

"ఎలాగడస్తుంది చెప్పు?"

"ఎందుకుగడవదో చూద్దువుగానిగా..నాదగ్గ రొకమాట, మాఅమ్మదగ్గ రొకమాట మాట్లాడ తావన్నమాట!"

"అదికాదనూ, అత్తయ్యఏమన్నా అనుకుటుందని ....ఆవిడ అన్నదానికల్లా అవునంటేసరి పోతుందని అలా అన్నాను. అనవసరంగా కాదన్నందు వల్లఒరిగేది ఏముంటుంది?"

"అందుకని నీ ఉద్దేశాలకి వ్యతిరేకంగా మాట్లాడతావా?"

"ఒక్కమాట. నీమాటని కాదన్నందుకేగా నీకీ కోపం. అలాగే ఆవిడని 'అఫెండు' చేయడం ఇష్టంలేక!"

"అంటే ఆవిడకి భయపడతావన్నమాట. అలాగే నేనంటేనూ భయం తప్పు. మరేమీ లేదన్నమాట....." బుంగమూతిపెటింది. ఆమె ఎర్రబడిన ముఖం చూసి అతనికి భయము వేసింది. పరిహాసం శృతిమించిందని.

"అది సరేగాని అనూ కాఫీ ఇవ్వు త్వరగా కాస్త పనుంది" అన్నాడు మాట మారుద్దామని

అనూరాధ మాట్లాడకుండా కూర్చుంది సోఫాలో.

రాధా, ప్లీజ్...త్వరగా అరకప్పుకాఫీ ప్రసాదిం చావంటే వాదారివ నేను పోతాను. అర్జెంటు పని!

"ఏమిటో ఆ పని?"

"మరేంలేదు —సినిమాకి వెళదామని"

అంతలో వికసించింది అనూరాధ ముఖం—"

రైట్ అయిదు నిమిషాల్లో కలిపి తీసుకు వస్తాను. అని ఒక్క పరుగులో వంటింట్లోకివెళ్ళిపోయింది.

శర్మతృప్తిగా నిట్టూర్చాడు."గండం గడిచింది అనుకుని నవ్వుకున్నాడు.

పదినిమిషాలు గడిచాయి.

"త్వరగా తాగు బావా, వెడదాం" అంది కాఫీ కప్పుఅందిస్తూ. అపాదమస్తకంపరీక్షగాచూశాడు పూర్తిమేకప్‌లో మెరిసిపోతోంది.

బహువచన ప్రయోగం దేనికి?' వెడుదువు గాని' అని వాడాలి" అన్నాడు కొంటెగా!

"ఏం నేను రాకూడదా?"అంది బుంగమూతి పెట్టి.

"వెనకటికెవడో కాశీకిపోతూ పిల్లి పిల్లను చంకన పెట్టుకు వెళ్లాడుట.!"

"రాధముఖం ఎర్రబడింది."నీకంటికి పిల్లి లాగా కనపడుతున్నానన్నమాట!"

"పిల్లేం ఖర్మ మేడమ్ పులివి, పులి!" అన్నాడు నవ్వుతూ.

"నువ్వెన్నిమాటలన్నా సరే ఇవాళ నీతో వచ్చి తీరుతాను."

"నే తీసుకు వెళ్ళకుంటే ఎలారాగలవు?"నందే హం వెలిబుచ్చాడు.

"నువ్వు నన్ను తీసుకు పోవాలా మహా!" నాదగ్గరా డబ్బుంది నాకూ కాళ్ళూ, చేతులూ ఉన్నాయి!"

"నడిచేందుకా?"

"అంటే అర్థంకాళ్ళతో నడుస్తానని. అతి తెలివికిపోకు మర్యాద దక్కదు."

"ఏమోలే చతుష్పాద జంతువేమోనని అను మానం కలిగింది."

"నువ్వు నాకు బావవేగా!"

"ఇందాక ఒక యుద్ధం అయింది. ఇది ఇంకోటా....నేను సినిమాకి వెళ్ళటం మానేశాను. శాంతించావా మహాతల్లీ!"

"నువ్వు మానేసినా, నేను వెడుతున్నాను. కావాలంటే తీసుకువెడతా నా వెంటరా!"

"ఎక్కడికే, అతన్ని నువ్వు తీసుకువెళ్ళేది?" అంది అప్పుడే ప్రవేశించిన శాంతమ్మగారు.

"ఆవద్యాంతపుడిలా అడ్డంపడ్డావత్తయ్యా! నీకూతురుతో గెలవలేక "లావొక్కింతయులేదు ధైర్యము విలోలంబయ్యె".....అన్న పద్యం అప్ప చెపుకుంటున్నాను. మనస్సులో!"

"పైకే అనకపోయావు—విని తప్పులుంటే చెప్పేదాన్ని."

"అదొకటా! పైకి అంటే బతకనిస్తావా?"

"నీ ప్రాణానికి భయంలేదు. అభయం ఇస్తున్నాను!"

"ఏం మాటలే అవి? మరీ బరితెగిపోతున్నావు! అతని అంతరం ఎంత నీ అంతరం ఎంత? రేపు ఆమూడుముళ్లూ పడ్డాక అలానే నీకుగతి ఏమను కుంటున్నావో?"

"అసలు విషయం మరిచి పోయావమ్మోయ్! నేనే ఆయనకిగతి అని మర్చిపోవద్దు" అని విసురుగా అక్కడినుంచి వెళ్ళిపోయింది. అనూరాధ.

"ఏమాట అనచ్చో, అనకూడదో కూడా తెలియటం లేదు దీనికి. అయినా ఈ వెధవచదువులు చదివి......"

"పోనీలే అత్తయ్యా, ఏదో చిన్న పిల్ల..... అనూ, నేనూ ఒస్తున్నా అగు" అంటూ ఆమె వెనకే పరుగెత్తాడు. శర .

"ఏం పిల్లలురా బాబూ, ఈ కాలం వాళ్ళు!.. అది ఏమన్నా ఇష్టమే.... అయినా నాకెందుకు మధ్య" అని నవ్వుకుంది. శాంతమ్మగారు.

• • •

"అప్పుడే వచ్చేశావేం రాధా, శాస్త్రులేదా?"

"మా సెక్షన్‌కి ఏదోపనుంటట. అందుకని పానకంలో పుడకల్లే ఇంటికి వెళ్ళమంది."

"మా వదినకూడా అంతేలే....అత్తయ్య ఏదీ?"

"ఎరుగున్న వాళ్ళఇంటికి వెళ్ళింది. ఇళ్లు జాగ్రత్త అని బీరువాలు, డ్రాయర్లూ అప్పచెప్పి వెళ్ళింది. రాత్రికిగాని రాదట!"

"అయితే ఇంట్లో లేదన్నమాట" అను కున్నాడు హుషారుగా.

ఇంచుమించు చిన్నతనంనుంచీ శర్మఇక్కడే ఉంటున్నాడు. తల్లిపోవటం, తండ్రి రెండవపెళ్లి చేసుకోవడం మేనమామగారింటికిచేరుకునిఅక్కడే అనూరాధతో కలిసి చదువుకుంటున్నాడు. కలిసి తిరుగుతున్న అనూరాధలో ఇదివరకు కనపడని ఆకర్షణ అతనికి ఈ మధ్య కనబడసాగినది. అది వయస్సుతెచ్చిన మార్పు.

అంతపెద్దఇంట్లో తను, రాధా— ఏకాంత ముగా ఉన్నారన్నభావన అతనిలో ఇదివరలో లేని కోర్కెల్ని కలిగించింది. అనుభవంలోని ఆలోచనలు రాసాగాయి. బయట వర్షపు తుప్పర మీదుగా వీస్తున్న గాలి అతన్ని రెచ్చకొట్టింది.

అనుకోకుండానే పక్కనేఉన్న రాధ చేతినిపట్టు కుని ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"ఏమిటి బావా!" అంది రాధ అమాయకంగా.

దగ్గరగా ఉన్న అతన్నిచూసి కంగారు పడింది. అతని కండ్లలోని భావంగ్రహించి కలవర పడింది. కాని దగ్గరకు తీసుకుంటున్న అతన్ని కాదనలేక పోయింది. పురుష స్పర్శ ఎరుగని ఆమెశరీరంఅతని స్పర్శతో పులకరించింది.

"ఈ క్షణంకోసం వేయికండ్లతో సంవత్సరాల తరబడి ఎదురుచూశాను అనూ" అంటూనే ఆమెని కౌగిట్లో ఇముడ్చుకున్నాడు. "నిన్ను నానుంచీ ఏశక్తీ వేరుచేయలేదు" ఆమెను తనలో కరిగించుకోవాలని ప్రయత్నిస్తున్నాడు—కాని...

తలుపుకొడుతున్న చప్పుడుతో ఇద్దరు ఉలిక్కి పడ్డారు. అంతరాయానికి బాధపడినా వెళ్లి తలుపుతీశాడు శర్మ.

"హల్లో శర్మా, కులాసాగా ఉన్నావా?" అంటూనే లోపలికి వచ్చాడు ప్రభాకర్.

శర్మ ఏమీ మాట్లాడలేదు. ప్రభాకరం రాక అతనికి ఆనందం కలిగించకపోగా కోపం కలిగించ కుండా ఉండలేకపోయింది.!

"ఏరా, అలా ఉన్నావు?" అడిగాడు ప్రభాకర్.

"ఏంలేదులే కూర్చో ఇప్పుడే వస్తా." అని లోనికి వెళ్లి ముఖం కడుక్కొని వచ్చాడు శర్మ.

"ఎప్పుడు రావటం?సెలవులు పడినట్టున్నాయే— బాగా లావయ్యావు!" అన్నాడు నవ్వుతూ.

"వచ్చి రెండు రోజులయిందిరా! ఒక నెల రోజులు సెలవుపెట్టాను. మొదట మా 'బాస్' ఒప్పుకోలేదు. మంచం మీదనుంచి లేవటం లేదని డాక్టరు సర్టిఫికెట్టు పుట్టించాను. టూరుమని చస్తూ సెలవిచ్చాడు. "అని గలగలానవ్వి 'ఇంట్లో ఎవ్వరూలేరా ఏమిటి?" అనడిగాడు.

(మిగతా 49 వ పేజీలో)

# వక్రించిన రేఖలు

(16 వ పేజీ తరువాయి)

"లేకేం—మా వరదలు—అదే మీ కజిన్ ఉంది.....కాఫీపట్టుకొస్తాను.కూర్చో" అని లేవ బోయాడు శర్మ.

"కూర్చోవోయ్, ఇప్పటినుంచే మీ కాబోయే మిసెస్‌కి ఒళ్ళు అలవకుండా నువ్వే చేస్తున్నావ్! అయినా రాకరాక మిత్రుడువస్తేవాణ్ణికూర్చోమని నువ్వుదూనుకుంటావా?"

అనూరాధ టీ పాట్ కప్పులు వగైరా ట్రేలో పెట్టుకుని వచ్చింది.

"ఇదిగో ఆవిడే మాకజిన్ అంటే అత్తయ్య కూతురు. బి. ఏ. ఫస్టియరు చదువుతోంది. ఇతను నా ఫ్రెండు ప్రభాకరం. బాంబేలో రేడియో ఇంజనీరుగా ఉన్నాడు." అని ఒకరికి ఇంకొకరికి పరిచయంచేశాడు శర్మ.

"గ్లాడ్‌టు మీట్‌యు మిస్ రాధాదేవి!...... నేనన్న మాటలో తప్పులేదనుకుంటాను"అన్నాడు చిన్నగా నవ్వి.

ఎవ్వరూ మాట్లాడలేదు.

అనూరాధ మటుకు కప్పుల్లో కాఫీపోసి తను ఒకటి తీసికొని మిగిలినవి వారిద్దరికీ తలొకటి ఇచ్చింది.

"బి. ఏ. లో మీది ఏ మెయిన్సన్నారూ?" అనడిగాడు ప్రభాకరం కాఫీ సిప్ చేస్తూ.

"నేనింకా యేమీ అనలేదండీ" అంది నవ్వుతూ.

"ఓహో, హ్యావురు విషయంలో మీరు నాకు తీసిపోరన్నమాట. ......ఇప్పుడడుగుతాను చెప్పండి."

"ఎకనమిక్స్"

"అయితే మా చెల్లాయికి క్లాసుమేటన్న మాట!"

"మీ సిస్టర్ ఇక్కడే చదువుతోందేమిటిరా— నాకు తెలియదు సుమా!"

"తెలియక పోయినందువలన మునిగిపోయిందేమీ లేదులే!"

"ఇంతకీ మీ సిస్టర్ పేరేమిటన్నారు" అంది అనూరాధ ఎవరో తెలుసుకుందామన్న కుతూహలంతో.

"ఇంకా ఏమీ అనలేదండీ!" అని నవ్వి" వసంత. ముందు 'మిస్' ఉందనుకోండి"

"వసంత మీ సిస్టరా! నాకు మంచి ఫ్రెండు లెండి. నీకు తెలియదా బావా — మొన్న అది వారం నాడు మనింటికి కూడా వచ్చింది కారప్పూస ఆడి వెళ్ళింది. ఎర్రగా ఉంటుంది"

"అవునవును. రెండు జడలు—"అని రాధ ముఖం చూసి కాసేపు తటపటాయించి" అయినా నీకోసం బోలెడు మంది వస్తుంటారు. నేనెవర్నీ చూడను, నాకెవరూ గుర్తుండరు" అన్నాడు.

ముగ్గురూ నవ్వుకున్నారు.

"ఆల్‌రైట్, అలా బయటికి వెళదాం వస్తావా?" అనడిగాడు ప్రభాకరం శర్మని.

"ఒక్క నిముషం కూర్చుని ఉండు వచ్చే స్తాను" అంటూ ఇంట్లోకి పోయాడు శర్మ.

ప్రభాకరం తనవంక తదేకంగా చూస్తున్నా డని పసికట్టిన అనూరాధ గోళ్ళు లెక్కపెట్టుకో సాగింది.

"మీరు హిందీ పిక్చర్స్ చూస్తారా?"

"చాలా ఇష్టం అసలు సాధారణంగా తెలుగు వైపుకి వెళ్లను" అంది రాధ.

"కరెక్ట్ నేనూ అంతే. సాధ్యమయినంత వరకు తెలుగు వాటికి వెళ్లను. నరే అరవం సంగతి చెప్పనక్కరలేదు — హత్య చేసినవాడిన్ని అరవ సినిమా సంభాషణ వినమంటే అంతకన్న వేరే శిక్ష ఉండదు వాడికి. మైలు పొడుగు ఉంటుంది డైలాగు ఒక్కటే"

అనూరాధ నవ్వింది.

"ఫాక్ట్ ... నేను మద్రాసులో ఉండగా ఆగోల పడలేక పోయేవాడిని కలకటా కూడా బాగానే ఉంది గాని బాంబే నాకు సూట్ అయింది."

"అయితే మీరు చాలా అదృష్టవంతులన్న మాట — మద్రాసు, బాంబే, కలకటా — అన్నీ చూశారు" అంది అనూరాధ కళ్ళు పెద్దవిచేసి.

"అదేనా — ఢిల్లీ వెళ్లాను ఇంటర్వ్యూకి సిమ్లా వెళ్లాను — చదివింది బాంగళూరులో"

ఇంతలోనే ప్రభాకరం వస్తూ "ఏమిటోయ్ కోస్తున్నావు? అన్నాడు నవ్వుతూ.

"కోయటం నీవంతురా బ్రదర్ .... ఏదో నాగురించి రాధాదేవికి చెప్పుకుంటున్నాను .. వస్తా నండి అనూరాధగారూ"

అనూరాధ వాళ్ళు వెళ్లిన వైపే చూస్తూండి పోయింది.

* * *

"రాధాదేవి గారూ, మీరు త్వరగా తెమలాలి. అవతల టైమయిపోయింది. ముందే రిజర్వు చేయించాను — పోనీ మానేద్దామన్నా". ప్రభా కరం గుమ్మంలో నిలబడి హడావుడి చేసేస్తున్నాడు.

'అక్కడికి ఆలస్యమంతా నీదే అయినట్లు మాట్లాడతారేం? మీ వసంత ఇంకా ముఖానికి మొదటి కోటింగయినా పూర్తి చేయలేదు!"

ప్రభాకరం పకపక నవ్వాడు.

"సరేగాని, ఇంతకీ శర్మగారు వస్తున్నారా అన్నయ్యా?" అడిగింది వసంత.

"ఏం ఆయన రాకపోతే నువ్వూ రావా?

"అని నేనన్నానా?"

"ఏమోలే, ఆయనా, నువ్వూ రాకపోయినా ప్రోగ్రాం మట్టుకు ఆగదు. అనూరాధగారూ, నేనూ వెడతాం! ఊఁ కానివ్వండి"

పావుగంటలో ఇద్దరూ తయారయి బయట పడ్డారు. శర్మ అంతకితమే వచ్చి కూర్చు న్నాడు. అందరూ వెళ్లి కారెక్కారు.

సినిమా మొదలయాక హాలు చేరుకున్నారు. ఎడ్వాన్స్‌బుకింగు కావటం వలన వాళ్ళ నాలుగు సీట్లుఖాళీగానే ఉన్నాయి. మధ్య మన్న రెండు కుర్చీలలో అనూరాధా, వసంతా కూర్చున్నారు. కానీ తన పక్కన ప్రభాకరం వచ్చి కూర్చోవటంతో అనూరాధ లేవబోయింది!

"ఏం, మీబావ పక్కన తప్ప ఇంకెక్కడా కూర్చోవా?" అంటూ చేయి పుచ్చుకుని లాగి కూర్చోపెట్టింది వసంత.

సినిమా జరుగుతుండగా రాధ చేతిమీద ప్రభా కరంచేయిపడింది. ఏదో పొరపాటున వెంటనే తీసేస్తాడులే అని అలాగే కూర్చుంది అనూ రాధ. కాని అటువంటిదేమీ జరగకపోవటంతో మెల్లిగా తనచేతిని లాక్కుంది. వెంటనే అతను కూడా తీసేశాడు.

ఇటువంటిదే ఇంటర్వెల్ అయిన తరువాత మళ్ళీ జరిగింది. కాని ఈసారి రాధమాత్రం చెయి తీసుకోలేదు. ఆమె చేతిమీదే అతని చెయ్యి ఉంది.

రోజులు గడుస్తున్న కొద్దీ వారి ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఎక్కువవుతోంది. మొత్తం మీద తన భావాలకనుగుణంగా ఉండటం వలన ప్రభాకరం అనూరాధ దగ్గిర స్నేహితుడుగా స్థానం సంపాయించ కలిగాడు. అతను తెచ్చే వింతలు—అతని భావాలు ఆమెకు నచ్చుతున్న యేవి.

* * *

"శర్మ గారూ పిక్నిక్ వెడదామంటే ఏమ్మటి కయినా?"అంది వసంత కాఫీ కలుపుతూ.

"నాట్ ఏబాడ్ అయిడియా!" సమర్థించింది. అనూరాధ.

"శర్మా, మాచెల్లాయి పెద్ద ఇన్నొటివ్ జీని యస్‌రా!. . .ఎక్కడికి వెడదాం చెప్పు ?" హుషా రుగా అన్నాడు ప్రభాకర్.

"ఎందుకురా, బోలెడు ప్రయాస. పైగా మా అత్తయ్య ఒప్పుకోదు బహుశ !'

"ఎందుకొప్పుకోదూ—అభారం నాది! ప్రభా కరంగారూ, ఆయన మాటకేంగాని చెప్పండి ఏవూరు వెడదాం ?"

వసంత మట్టుకు "చెప్పండి శర్మగారూ మీఛాయస్ ఏమిటి ?" అనడిగింది శర్మని.

"ఇది నాకు ఇష్టంలేదు. అందువలన నా ఛాయస్ వెళ్ళటం—వెళ్ళకపోవటంం మధ్యనే"

"మాబావ ఉత్త పెసిమిస్టు లెండి"

"రాధాదేవిగారూ—ఊరువిషయం మీకే వది లేశాం"

"సింహాచలంగాని, భీమ్లీగాని వెడితే" అను మానస్పదంగా ప్రతిపాదించింది అనూరాధ.

"వెరీగుడ్, సింహాచలం వెడదాం! పుణ్యం, పురుషార్థం రెండూ కలిగివస్తాయి. అనాసపండ్లు కూడాబాగా తినచ్చు!"అన్నాడు ప్రభాకరం కాఫీ రెండుగుక్కల్లో తాగేసి బల్లమీద పెట్టాడు.

"ఒప్పుకున్నాం—ఏమండీ శర్మగారూ సరేనా అడిగింది వసంత 'సరే అనండి'అన్నట్టుచూస్తూ.

"అలాగే కానివ్వండి—వెనూ ప్రతీలో వసుగుల

కలిసి, కుక్కని గాడిద అని చెప్పి నెలాయించే శక్తి ఉంది!"

"రేపు ఆదివారం మాకారులో వెడదాం— ఈ, ఈపూటకి బీచికి వెడదాం పదండి"

* * *

"వాటర్ బాటిల్, ఫ్లాస్కులు రెండు, కారియర్—అన్నీ ఉన్నాయా ? బ్రెడ్‌నైఫ్ ఒకటి తీసుకోండి. ఆజాప్‌దబ్బా కొత్తదేనా ? అసలు సింహాచలంలో కావలసినది అనాసపళ్ళు—ఈ లొట్టిలు, జాము అనవసరం అనుకోండి. కాఫీ పొడి పట్టుకరండి హొటల్లో కాయిద్దాం!" హుషారుగా అటు ఇటూ తిరుగుతూ చెప్పుకుపోతున్నాడు ప్రభాకరం.

"అన్నీ సిద్ధంగా ఉన్నాయి. పదండి—త్వరగా వెళ్ళకపోతే మళ్లీ ఎండలోకొండ ఎక్కటం కష్టం వసంతా! ఏదీ, ఎటుపోయింది—మామహాశయుడేడీ ?

"వస్తున్నారులే—కమాన్ మీరు త్వరగా రండి. మనం ముందుకారులో కూర్చుంటే వాళ్లే వస్తారు" అంటూ అనూరాధ చేయిపుచ్చుకుని బరబర లాక్కుపోయి వెనకసీటులో కూర్చోపెట్టి తలు పక్కన కూర్చున్నాడు ప్రభాకర్.

రాధ ఖంగారు పడిందిగాని లేవలేదు.

ఇంతలో వసంత హడావుడిగా వచ్చి "అరెరె, మీరప్పుడే కూర్చున్నారే—శర్మగారూ స్టీరింగు దగ్గర కూర్చోండి" అంది తను ఫ్రంటుసీటులో కూర్చుని.

శర్మ మాట్లాడకుండా ఒకసారి రాధవైపు చూశాడు. రాధ తలతిప్పుకొని బయటికి చూస్తోంది.

"త్వరగా రండి స్వామి—అవతల టైమ్ కరుగెత్తుతోంది" అని అతని చేయి పుచ్చుకుని లోపలికి లాగింది.

యాంత్రికంగా కూల బడ్డాడు శర్మ.

కారు తారు రోడ్డు మీద మెత్తగా పరుగెత్తుతోంది.

చూడండి రాధాదేవీ! మెట్లపక్కగా ఉన్న వాటర్‌ఫాల్స్ బావున్నాయా ? శుభ్రంగా టవలు కట్టుకుని వాటికింద కూర్చోవాలనిపించటంలేదూ! ఏరా శర్మా ఏమంటావు?

అతను మాట్లాడ లేదు.

"ఏరా మాట్లాడవు? అంత కష్టంగా ఉంటే మానేశావాళ్ళంగా!

"సారీ, ఏదో పరధ్యానంగా ఉన్నాను. అంతే".. ఏమిటి నువ్వన్నది?"

"చూడండి శర్మగారూ, ఈఅనాసవృక్షాలు ఎంత బాగున్నాయో? వాటిని ఎక్కి ఆడుకోవాలని పించటంలేదూ మీకు?" అడిగిందు వసంత.

"మరే నాకూ అలాగే అనిపిస్తోంది !"— అన్నాడు శర్మ పరధ్యానంలో. ముగ్గురు ఒక్కసారి నవ్వటంతో ఈలోకంలో పడి అందరివంక చూశాడు అర్థంకాక.

"అనాస చెట్లు ఎక్కటం ఏమిటిరా నీముఖం! ఆవు పళ్ళుగట్టి వృక్షం మీద కోతి కొట్టుచ్చి ఆడుదుపుగాని బ్రదర్ కాస్త మహాత్సులోకిరారా" అన్నాడు వీపుమీద చరిచి ప్రభాకరం.

"అబ్బ నేను నడవలేక పోతున్నాను బాబూ— ఈమెట్లకి అంతు లేదా ఏమిటి?"అంది వసంత మోకాళ్ళ పట్టుకుంటూ.

"చూడు వసంతా, ఈపనస చెట్లు ఒక్కొక్కదానికి ఎన్నేసి కాయలున్నాయో —ఏం బావా సాయంత్రం ఇంటికి ఒక పనసకాయ తీసుకుపోదాం !"

'అలాగే' అన్నాడు నిర్లిప్తంగా శర్మ.......

ఇది శ్రీకృష్ణదేవరాయలు సింహాచలేశ్వరునికి ఏర్పాటు చేసిన నైవేద్యాలు. రోజూ ఈ పిండి వంటలన్నీ తయారు చేసేట్టు ఏర్పాటుచేశాట్ట ఆయన...చూడండి ఆశిల్పం. చుట్టూ ఉన్న మంటపంకి పైన ఉన్న దేవాలయ గోపురం గాలికి అరిగి పోయింది. కింది భాగం మట్టుకు ఎంత ముచ్చటగా ఉందో. ఇది సత్రం—ఇది! పూట. అన్ని కాలాల్లోనూ నీళ్లు పడుతూనే ఉంటాయి. తియ్యగా, చల్లగా ఉంటాయి.."అని బయటివన్ని వర్ణించి చెప్పి వాళ్లని లోపలికి తీసుకుపోయాడు దేవస్థానం ప్యూన్.

"ఇది కప్పస్థంభం. సంతానం లేనివాళ్ళు రూపాయి ఇచ్చి ఈస్తంభాన్ని కావలించుకుంటే కడుపు ఫలిస్తుందని ప్రతీతి!" ..............

వసంత రాధని మోచేత్తో పొడిచి స్తంభం చూపించింది. ఇద్దరూ నవ్వు కున్నారు.

గర్భగుడిలోకి వెళ్లి స్వామి చుట్టూ వున్న మంచి గంధాన్ని చూశారు. సంవత్సరంలో ఒక్కసారి ఆమంచి గంధాన్ని తీస్తారు. అప్పుడు స్వామి వారి నిజ స్వరూపం కనబడుతుంది. ఇతర దినాల్లో ఎవరు చూసినా ఆమంచి గంధాన్నే! బయట మట్టుకు నిజస్వరూపం ఫోటో ఒకటి ఉంటుంది.

నలుగురూ బయటికి వచ్చారు. కొబ్బరి ముక్కలుగా కొడుతోంది అనూరాధ.

ప్రభాకరం ఆలయగోపురం మీదుగా కొండ శిఖరాన్ని చూస్తున్నాడు. శర్మ పక్కగా వసంత కూర్చుంది.

ఉన్నట్టుండి "ఏరా శర్మా, శిఖరం ఎక్కుదాం వస్తావా— చక్కని దారి కూడా ఉంది." అన్నాడు ప్రభాకరం.

"క్షమించు బ్రదర్, నేను ఒక్క అడుగు కూడా వేయలేను!

"అదేమిటోయ్, అంత నీరసం అయితే ఎలా? వాసంతీ—నువ్వు?"

"ఉహుం నాకూ కాళ్ళు నెప్పిగా ఉన్నాయి. కావాలంటే రాధా, మీరు వెళ్లిరండి "మేం ఇక్కడే ఉంటాం.!"

"మేమెలాగూ వెడతాంలే! సరదాగా మీరూ వస్తారేమోనని ఆశపడ్డాను. పదండి రాధాదేవి గారూ!"

"వసంత రాకపోతే నేనూ రాను లెండి."

"అదేమిటి నాతో ఒంటు—బాగానే ఉంది— ఈకొండ మీదినించి చూస్తే వైజాగ్ ఎయిర్‌పోర్టు షిప్ యార్డు, యూనివర్సిటీ టవర్ క్లాకు— అన్నీ కనబడతాయి. ఇదివరలో నేనొకసారి ఎక్కాను. అనాసతోటలున్నాయి. వస్తూ వస్తూ కొనుక్కురండి!"

"నువ్వు రావా బావా ?"

"రాలేనులే, చూడాలనుంటే మీరువెళ్ళండి!"

"రండి రాధాదేవీ — వీళ్ళు ముసలాళ్ళు. పదండి మనం పోదాం అంటూ దారితీశాడు. రాధ అనుసరించింది.

దారి సన్నగా ఉండటంవలన ఇద్దరు దగ్గరగా నడుస్తున్నారు. "చూడండి ఎంత బావుందో— మొదట రానన్నారు. ఇంత ఆనందాన్ని పోగొట్టుకునేవారు. అరెరె— అటు పాము పుట్ట ఉంది. ఇటు రండి" అంటూ ఆమె చేయి పుచ్చుకుని ఇవతలికి లాగాడు. కాని చేయిమట్టుకు వదల్లేదు. రాధకూడా మాట్లాడేస్థితిలో లేదు. అతని చేతిలోంచి తన చేతిని తీసుకోవాలన్న ధ్యాసే లేకపోయిందామెకి ఆ క్షణంలో.

"రాధా" అంటూ ఆమెని తనవైపుకి లాక్కున్నాడు ప్రభాకరం. మెల్లిగా తల ఎత్తింది, అతని స్పర్శలో ఆమెకు విస్మరించిన అనుభూతులేవో జ్ఞాపకం వచ్చినట్లయింది. ఇదివరలో చేజారిన సుఖం ఇప్పుడు అందుతున్నట్లయింది ఆమెకి. రక్తం పరవళ్ళు తొక్కింది. — తన శరీరంపై ది అధికారాన్ని ఆమె పోగొట్టుకుంది.

"నువ్వు నాదానివి రాధా — ఏశక్తీ మన్ని వేరు చేయలేదు" ఆమెని కవుగిట్లోకి ఇముడ్చుకున్నాడు.

ఈ మాటలు ఆమె వినటం ఇది రెండవసారి. కాని, ఈ పరిస్థితిలోని ఈ మాటలు ఆమె హృదయానికి హత్తుకుపోయాయి.

అతనికి తన సర్వస్వం అర్పించుకుంది!

* * *

"రాధ ఎక్కడికి వెళ్ళింది అత్తయ్యా ?"

"సినిమాకి వెళ్ళినట్టుంది. నువ్వు వస్తున్నావందే!"

"వెంట ఇంకెవరయినా ఉన్నారా ?

"నీ స్నేహితుడు ప్రభాకరం వచ్చాడు., వసంతా, శర్మాకూడా వస్తున్నారుట సినిమాకి వెడుతున్నాను అంది. ఇంతకీ నువ్వు వెళ్ళలేదా ?" అంది ఆశ్చర్యంగా కాంతమ్మగారు.

"లేదత్తయ్యా, వసంత కూడా ఇంటిదగ్గరే ఉంది... తరువాత వెడుతుందేమోలే!"

"ఏమో ? అయినా ఆ అబ్బాయితో షికార్లేమిటి — వయసొచ్చిన పిల్లకదా!"

"పోనీలే అత్తయ్యా — అదొక సరదా!"

మరొక రోజున—

"వసంతా, మారాధ మీ ఇంటికి వచ్చిందిట నీ నోట్సుకోసం — ఉందా వెళ్ళిపోయిందా" అంటూ వచ్చాడు శర్మ రాత్రి ఎనిమిదింటికి.

"రాధా — నా నోట్సుకోసమా. .భలేవారే. మా అన్నయ్యా, తనూ కలిసి బీచికి వెళ్ళారు. కూర్చోండి కాఫీ ఇస్తాను"

"ఇంకా రాలేదేమో ?"

"అటునుంచి సినిమాకి పోయారేమో!"

రాధలోని ఈ పరివర్తన శర్మని కలవరపెట్టింది.

"రాధా, ఎందాకా వెడుతున్నావో అడగవచ్చా?"

"అనవసరమనుకుంటా! అంది వెడుతున్నదల్లా వెనక్కి తిరిగి.

"క్షమించు — నువ్వు ప్రభాకర్‌తో అంత సన్నిహితంగా తిరగటం మంచిదికాదు.

"నువ్వు వసంతతో తిరగటమో ?"

"మే మిద్దరమూ మీలాగా బీచీలకి, సినిమాలకి పోవటంలేదుగా!"

"ఏమో, దేవుడికి తెలియాలి. సరేగాని నాకు టైమయింది వస్తా!"

"మళ్ళీ సినిమాకి వెడుతున్నట్టుంది" అనుకుని వెనక చప్పుడుకి వెనక్కి తిరిగాడు.

"విన్నావా అత్తయ్యా, రాధ సమాధానాలు!" అన్నాడు.

కాని అతని మాటలు వినిపించుకోకుండా—

"అవునుగానీ ఆ అబ్బాయి మంచి ఉద్యోగం చేస్తున్నాట్టగా!" అంది.

"అవును ఏం?"

"కారుకూడా వుందట. బాగా ఆస్తి పరులా?

"ఆఁ అన్నాధికార్లు.... ఎలాతెలిసాయి? రాధ చెప్పిందా?"

ఆమె దానికికూడా సమాధానం ఇవ్వలేదు. మాట్లాడకుండా కూర్చుంది. శర్మకి మాట్లాడేందుకు ఏమీ తోచలేదు. ఏష్ట్రేని చూస్తూ కూర్చున్నాడు.

అతనికి అనూరాధ ప్రవర్తన నచ్చక పోగా చాలా బాధనికూడా కలిగించింది. ఇన్నేళ్ళుగా తను వాళ్ళఇంట్లో ఉంటున్నప్పటికీ ఆమె ఇలా మాట్లాడటం ఇదేప్రథమం!.... ఆమె మనస్సులో ఉన్న దేదో నిష్కర్షగా తేల్చి చెపితే అతనింతగా కష్టపడేవాడు కాడు. కాని అలా చెప్పక పోవటం అతన్ని మరీ వేధించింది.

"ప్రభాకరం విషయం మాట్లాడితే చూశావా అత్తయ్యా రాధ ఎలా సమాధానమిచ్చిందో" అన్నాడు ఆమె అయినా కాస్త ఒదార్పుగా మాటలాడుతుందేమోనన్న ఆశతో.

కాని అతని ఆశ నిరాశఅయింది.ఆమె మౌనం వదలలేదు. !

"ప్రభాకర్ కాస్తజల్సాగాడు. అతనితో రాధ తిరగటం అంతమంచిదికాదనుకుంటా!"అన్నాడు.

"పోనీలే శర్మా, దానిష్టం! దాన్నిగురించి ఇంత వ్యాఖ్యానం దేనికి?" అంది ఆవిడ విసుగ్గా.

అతను ఆశ్చర్యపోయాడు. ఆమెలోని నిరసన అతన్ని మరింత బాధించింది. "సరే అత్తయ్యా, నీ ఇష్టం!" అని లేచి వెళ్ళిపోయాడు.

శర్మ పెసిమిస్టు కాదు—ఆశావాది! రాధ ప్రభాకరాన్ని ప్రేమిస్తోందన్న విషయం అతనికి క్రమంగా రూఢీ అయింది. ఆ విషయం అతన్ని మొదట కలవర పెట్టకపోలేదు. —కాని క్రమేపీ మారుతున్న పరిస్థితులకి అలవాటు పడ్డాడు.

తనకన్న ప్రభాకరం అన్ని విధాలా పైమెట్టు మీద ఉన్నాడన్న విషయం అతనికి తెలుసు. కనుకనే అతనికి రాధమీద కోపంరాలేదు. ప్రభాకరం గెజిటెడ్ ఆఫీసరు—అందగాడు—ఆస్తిపరుడు. అన్నిటినీమించి ఆడవాళ్ళని వశపర్చుకోగల—ముగ్ధులని చేయగల వాగ్ధోరణిఉంది. అతన్నిచేసుకుంటే రాధను సుఖపడుతుంది. శర్మకి కావలసింది కూడా అదే!

కానిఎందుకోశర్మకి ఈవిషయంలోభయంకూడా లేకపోలేదు. దానికి కారణం ప్రభాకరం. ప్రభాకరం గత చరిత్ర ఏమంత అమోఘమయినది కాదని శర్మకి తెలుసు. అతను తుమ్మెదవంటి వాడు......అందుకే శర్మకోరేది వారిద్దరికి శాస్త్రోక్తమయిన బంధం!

రాధ విషయం పూర్తిగా అర్థం చేసుకున్న తరువాత అతను ఇంకో నగ్న సత్యం గ్రహించగలిగాడు.—అదివసంతమనస్సు! ఆమెకి తనమీద ప్రేమ ఉందని —ప్రతిఫలానికి ఎదురుచూస్తోందని ఇంతవరకు తట్టక పోవటం అతనికే ఆశ్చర్యం కలిగించింది!

ఆ తరువాత గతసన్నివేశాలని ఈ కొత్తకోణంలోంచి సింహావలోకించాడు. ,.. మొదటినుంచీ కూడా ఆమె తనతో సన్నిహితత్వాన్ని కోరింది.అని తెలియంగానే ఆనందపడ్డాడు. ఆనాటినుంచి ఆమెఎడ్ల తన ప్రవర్తన సరిచేసుకున్నాడు శర్మ. ఆమెకు తన హృదయంలో స్థానం ఇవ్వటం నేర్చుకోదలుచుకున్నాడతను!

కాలం మారుతోంది. దాంతోపాటు మనుష్యులు వారిమనస్సులూ మార్పుచెందుతున్నాయి.

* * *

మొదట పెట్టివచ్చిన నెలరోజులు శలవులేక మరి రెండు నెలలు పొడిగించాడు ప్రభాకరం. కాని పొడిగించిన శలవులో ఇంకా వారంరోజులు ఉండగానే బొంబేకి బయలు దేరాడు.

"శర్మ, వసంతాస్టేషన్‌లో వీడ్కోలుఇచ్చారు.

అనూరాధ స్టేషన్‌కి రాననడం శర్మకి ఆశ్చర్యం కలిగించింది. శలవుపూర్తికాకుండానే ప్రభాకరం బయలు దేరటం —అందులోనూ రాధని కలుసుకోకుండానే వెళ్ళటం అతనికి మరీ విపరీతంగా తోచాయి.

ఆ నాటి రాధప్రవర్తనలో విపరీతమయిన మార్పు కన్పడింది శర్మకి—రాధ వసంతతోకూడా మాట్లాడటం మానేసింది. గదిలోంచి బయటకు రాకుండా గడిపేది.

కాలం గడుస్తున్నకొద్దీ శర్మకి ఇంట్లోని వాతావరణం బొత్తిగా నచ్చటం లేదు. ఎప్పుడూ హుషారుగా కలకల్లాడుతుండే రాధతనతోమాట్లాడక పోవడం అతనిని బాధించింది.

అక్కడికీ ఆమె ప్రభాకర్‌ని చేసుకోవడం తనకి ఆనందమేనన్న భావం వ్యక్తపరిచాడుఒకటి రెండు సార్లు! కాని అవి ఆమెకి ఆనందాన్ని కలిగించాయో లేదోగాని వెంటనే అక్కడనుంచి వెళ్లిపోయింది.!

ఇకపోతే అత్తయ్య ప్రవర్తన కూడా అతనికి అర్థం కాలేదు. తల్లీ కూతుళ్ళు కలిసి ఏదో మాట్లాడుకోవటం తాను రాగానే ఆపేయటం, రాధ కళ్ళు తుడుచుకోవడం అతనికి ఏమాత్రం బోధపడలేదు. అందుకనే ఈ విచార వాతావరణాన్ని సాధ్యమయినంతవరకు తప్పించుకునేందుకు ప్రయత్నించసాగాడు. ఇప్పుడు తన హృదయానికి కొంత శాంతిని కలిగించేది వసంతే ! అందుకనే వాళ్లింటికి తరుచు వెళ్ళ సాగాడు.

"నాయనా శర్మా!"

ఆ పిలుపుతో బయటకు వెడుతున్న వాడల్లా నిలబడి వెనక్కి తిరిగాడు.

అత్తయ్య నిలబడి ఉంది !

"ఎందుకత్తయ్యా పిలిచావు !"

"నీతో కొంచెంసేపు మాట్లాడాలి—అలా కూర్చో" అంది తనూ కూర్చుని.

అతని కేమీ అర్థం కాలేదు. తనతో ఆవిడ అంత చనువుగా మాట్లాడి చాలా కాలమయింది.! మాట్లాడకుండా కూర్చున్నాడు.

కాసేపు నిశ్శబ్దంగా గడిచింది.

చివరికి అటూఇటూ చూసి "రాధనిగురించి" అంది మెల్లిగా, అతనేమీ మాట్లాడలేదు.

మళ్ళా నిశ్శబ్దం ఆవరించింది. ఎలా మొదలెట్టాలో తెలియక తటపటాయిస్తోంది ఆమె.

"రాధకి... నెల తప్పింది" అంది చివరికి

"అంటే?" అన్నాడు అనాలోచితంగా శర్మ అని వెంటనే గ్రహించి "మైగాడ్" అన్నాడు మెల్లిగా.

"గట్టిగా అడిగాను. ముందు ఏడిచింది.తరవాత చెప్పింది ప్రభాకరం అని"

"అవును—నేనూ అదే అనుకున్నాను" అన్నాడు తలవంచుకుని.

"ఇప్పుడేమిటి చేయటం?"

"ఏముంది ? వాడిని పిలిపించి ఆపెళ్ళికాస్తా అవచేద్దాం సరిపోతుంది" అన్నాడు శర్మ.

పేలవంగా నవ్వింది శాంతమ్మగారు"పిచ్చివాడా, ఇది అంత తేలికగా అయేపనికాదునాయనా! వెళ్లేముందు ఆకాస్తమాటా అనేసివెళ్ళాడుట!"

"ఏమని?"

"తనకేమీ సంబంధంలేదని!"

"రోగ్, ఎలా అనగలిగాడు ?"

"అనేందుకేముందబ్బాయి! తప్పు మనదగ్గర ఉంది ఆరిటాకు ముల్లుమీదపడ్డా' ముల్లు ఆరిటాకుమీదపడ్డా నష్టం ఎవరిది ?... ...

ఆడదాని బ్రతుకు తీరే అంత "అని కాసేపాగి" అనాడు నీమాట పెడచెవిని పెట్టినందుకు మంచి శాస్తి అయింది. అది చిన్నది పోనీ—నాకళ్ళు కప్పేసుకు పోయాయి!"

"ఆమాటలకేంగాని అత్తయ్యా, రాధ ఏమంటుంది."

"ఏమంటుంది. నాఖర్మ అంటూంది. బలవంతాన ఏఅఘాయిత్యం చేస్తుందోనని హడలిచస్తున్నాను.అయినా నువ్వొకసారిపలకరించునాయనా!"

'సరే అని లేచి నిలబడ్డాడు. అన్నాడేకాని ఎలా

మాట్లాతాలో ఏమని అడగాలో అతనికి తెలియలేదు.

యాంత్రికంగా వెళ్ళి తలుపు తీసుకుని గదిలోకి వెళ్ళి తలుపు దగ్గరగా వేశాడు.

మంచంమీద పడుకున్నదల్లా గబుక్కున లేచి కూర్చుంది.

ఆమెని చూస్తే అతనికి కడుపులో తిరిగినట్లయింది.

'విచారము' అంటే ఏమిటో ఎరగని ఆనాటి అనూరాధేనా అనిపించింది.!

"రాధా"అన్నాడు మెల్లిగా.

తలెత్తి మళ్ళీ దించేసుకుంది.

"చదువుకున్న దానివి ఇంత తెలివి తక్కువగా ప్రవర్తించావేం రాధా?" అన్నాడు— అని ఎందుకన్నానా అని పశ్చాత్తాప పడ్డాడు.

రాధలోని అహంకారాన్ని రెచ్చకొట్టాయి ఈ మాటలు. తన ప్రస్తుత పరిస్థితికూడా మరిచిపోయింది. ఉక్రోషంలో!

"దీనికి కారణం ఎవరో తెలుసా?"అడిగింది తీక్షణంగా.

"ఎవరు?"

"నువ్వు!"

నేనా అదిరిపడ్డాడు— "నేనా?....దేనికి?'

'నా ఈ పతనానికి కారకుడివి నువ్వు! నాలో కోర్కెలని రెచ్చకొట్టింది నువ్వు. నాలోని స్త్రీత్వాన్ని మేలుకొలిపింది నువ్వు!...జ్ఞాపకం ఉందా. ఆనాడు ఈ గదిలోనే....ఆనాడే నువ్వునాలో కోర్కెల్ని రెచ్చకొట్టక పోయుంటే నేనింత అధోగతికి దిగజారేదాన్నికాదు. వాంఛని కలిగించావు కాని...కాని వాటిని...."అంటూనే దిండులోతల దూర్చి వెక్కివెక్కిఏడవటం మొదలెట్టింది.

అతనికి తలతిరిగిపోయింది.

"ఆపురాధా—ఆపెయ్!..మంచిపాఠం నేర్చావు తప్పుచేసినప్పుడు ఎందుకు చేశామా అని సిగ్గు పడవలసిందిపోయి పైగా నేనంటావు దీనికంతకూ కారణం—అసలువాడు ఆ వెధవ బాగానేఉన్నాడు ప్చ్! కాని ఒక్కవిషయం. నువ్వునన్నెన్ని అన్నా సరే—నాకు కోపం రాదు. నీ మంచినీ, ఉన్నతినీ కాంక్షిస్తాను. మొదటనిన్ను హెచ్చరించాను. కాని అప్పట్లో నామాటలు విషమయాయి.....సరే అవన్నీ ఇప్పటికి అనవసరం....వస్తా!"అని బయటికి వచ్చేశాడు.

"అత్తయ్యా,ఈరోజే బొంబే వెడుతున్నాను. ఆ వెధవని నయానో, భయానో ఒప్పించి తీసుకవస్తా—రాధ ఇల్లు నిలుపుతా!" అన్నాడు ఆవేశంతో.

ఆ సాయంత్రమే బయలు దేరాడు.

అర్ధాంతరంగా వచ్చిన శర్మని చూసి ప్రభాకర్ ఆశ్చర్యపోయి "హలోవ్—శర్మా ఎప్పుడు రావటం? కులాసా?" అన్నాడు.

"నీతో ఒకవిషయం మాట్లాడాలి రా" అన్నాడు శర్మ సీరియస్‌గా.

గ్రహించాడు ప్రభాకరం.

"గుడ్‌ఈవెన్స్! ఇప్పుడునాకు అర్జంటు పని వుంది బ్రదర్— సాయంత్రం మాట్లాడదాం. అంతవరకు బై బై"అన్నాడు హడావుడిగా డ్రస్ చేసుకుంటూ.

"అదేం లాభంలేదురా అబ్బీ— ఈ విషయం పూర్తయితే నువ్వు కదలటం—కూర్చో" ఉరిమాడు శర్మ.

ప్రభాకరం మాట్లాడకుండా నిలబడ్డాడు.

"మా అనూరాధ విషయం నీతో మాట్లాడాలి!"

"మీ రాధ విషయం నాతో ఎందుకోయ్? అది మీలో విషయం" అన్నాడు పేలవంగా నవ్వుతూ.

"మాలోంచి 'మనలోకి' దిగింది కాబట్టి. నీతో మాట్లాడటం....పెళ్ళి ఎప్పుడు చేసుకుంటావు?"

"ఇంకా సంబంధం కుదరందే పెళ్ళి ఎలాగురా బ్రదర్!"

"ప్రశ్నకి అదికాదు సమాధానం!..." రాధని ఎప్పుడు చేసుకుంటావు?" అని అడుగుతున్నా నువ్వు చేసిన వెధవపని తెలిసిపోయింది!"

"ఏమిటది?" అన్నాడుతెలియనట్టు.

"రాధకి మూడవనెల!"

"అభినందిస్తున్నాను బ్రదర్ నిన్ను...గట్టివాడివే. ఇకపెళ్ళికూడా పూర్తికానిచ్చుకో!"

"శర్మకి కోపం మండిపోయింది.

"ఇడియట్—దానికి కారణం నువ్వు. పెళ్ళి చేసుకోవలసింది నువ్వు. అతిగా వాగక ఇంటికి పోదాం పద" అరిచాడు.

"మిస్టర్‌శర్మా! ఇందాకనుంచీ సరదాగామాట్లాడుతున్నావని నీ ఇష్టం వచ్చినట్లు పేలుతున్నావ్ చెపుతున్నావిను. నాకు ఆమెతో సంబంధం లేదు. చిన్నతనంనుంచీ కలిసి పెరిగారు. ఒక కంచంలో భోంచేసి ఒకమంచంలో పడుకోకలిగిన నువ్వు ఎందుకు కాకూడదు దీనికి కారణం?.....నలుగురిలో అల్లరి పడక గుట్టుగా పెళ్ళిచేసుకో. ఎవరితో నయినా చెపితే నీముఖానే ఉమ్మేస్తారు. ఈ లోపల బయటికి నడు. ఇంట్లో బావని అట్టిపెట్టుకుని వూరివార్లందరినీ అంటే ఎవ్వరూ పడరు"అని చేయి పుచ్చుకుని బరబర బైటికితీసుకెళ్ళి తలుపుతాళం వేశాడు....

శర్మ దిమ్మెరపోయాడు. అతనన్న మాటల్తో శర్మలో తనెక్కడ ఉన్నదీ కూడా జ్ఞప్తిలేకుండా పోయింది.

"వస్తామిస్టర్ శర్మ" అంటూ వెళ్ళిపోతున్న ప్రభాకర్‌ని అచేతనంగా చూస్తుండి పోయాడు.

"విన్నావా వసంతా! మీ అన్నయ్య ఎంతటి నీచుడో? అసలు చావకొట్టి వద్దామన్న భావం కలిగింది గాని—అల్లరికి వెరిచి. . .పైగా వాడన్న మాటలు నలుగురిలో చెప్పాడంటే పరువుగంగలో కలుస్తుంది. అందరూ నేనే దీనికి కారణం అని చాటుగా నవ్వుకుంటారు!

"మీ అత్తయ్యకి చెప్పావా?" అంది వసంత.

ఆ అమ్మాయికి అన్నగారి ప్రవర్తన చాలా అసహ్యం కలిగించింది. కాని ఏం చేయుకలదు. తనూ అతని మీదనే ఆధారపడి ఉంది. పైగా అతని ఈ ప్రవర్తన ఆమెకి కొత్తది కాదు!

"చెప్పాను!"

"ఏమన్నారు?"

"ఏమంటుంది? దాన్నెలాగయినా ఒకింటి దాన్ని చేసే భారం నీదేనంటుంది!"

"రాధ ఏమంది?"

"మీ అన్నయ్య లాగానే నన్నే తిట్టిందని చెప్పగా—ఇప్పుడు కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది." అని కాసేపాగి "నేను మొదట్నుంచీ అనుమానిస్తూనే ఉన్నాను వాసంతీ—ఇది దుఃఖాంతం అవుతుందని ప్రభాకరం మీద నాకు నమ్మకంలేక రాధని హెచ్చరించాను కూడా కాని విధి ప్రతికూలించింది."

ఇందులో నీకూ కొంతభాగం ఉందనుకుంటా శర్మగారూ. వాళ్ళిద్దరి ఏకాంతానికి, రహస్య సమావేశాలకి ప్రోత్సహించానుకూడా దానికి కారణం మీరు" అంది తల వంచుకుని

ఆశ్చర్యపోయాడు శర్మ.

"అంటే మరేంలేదు. రాధ మా అన్నయ్యని చేసుకుంటుందని, అప్పుడు నేను. . .మిమ్మల్ని..

"తెలిసింది వాసంతీ తెలిసింది. . .ప్చ్! ఇప్పుడిహ లాభం లేదు" ఉలిక్కిపడి "ఎందువలన?" అనడిగింది వసంత.

"రాధ విషయం తెలిసిన వారెవరూ ఆమెని చేసుకోరు. తెలియని వాడు చేసుకున్నా తెలిశాక బాధపెడతాడు. ఆమె జీవితం కంటకమయం అవుతుంది. కాబట్టి తెలిసికూడా త్యాగం చేయగలవారు దొరకాలి ఇప్పుడు!"

"అదెలా, కష్టం కాదూ?"

"అసంభవం కూడా. కాబట్టే వసంతా, నేనొక నిర్ణయానికి వచ్చాను. నేనేఆపని చేయాలి. అప్పటికి కాని చిన్నతనం నుంచి నన్నుపెంచిన అత్తయ్యకి మనశ్శాంతి ఉండదు—రాధ జీవితం బాగుపడదు!" అన్నాడు దృఢస్వరంలో.

"వాళ్ళకోసం బాధపడ వలసింది మనమా?" వసంత గొంతు పూడిపోయింది. ఆమె కండ్లలోని నీటిని చూసి అతనికండ్లు చెమర్చాయి—గొంత గాద్గదిక మయింది.

"ఇంకోదారిలేదు వాసంతీ! మీ అన్నయ్య చేసిన తప్పుకు నువ్వు, మారాధ చేసిన తప్పుకు నేనూ, ఈ శిక్ష అనుభవించవలసిందే...నీ జీవితం నిర్మల మయినది. కాబట్టి నాకన్న అన్నివిధాలా యోగ్యుడయినవాడు వస్తాడు వచ్చి తీరుతాడు. ఆ దొరికిన వ్యక్తిని ప్రేమించడం నేర్చుకో—జీవితంలో ఎప్పుడూ తప్పటడుగు వేయకు. . చూస్తున్నావుగా దీని విషఫలితం!. . .నన్ను మర్చిపోవటానికి ప్రయత్నించు శలవు!" అని వెళ్ళిపోయాడు.

దూరమై పోతున్న అతన్ని సజల నేత్రాలతో చూస్తూ చేతులు జోడించింది వసంత. ★